తీపి

*డి. హనుమంతరావు,

"గ్లాడ్ టు మీట్ యూ!" అంది ఉష, మూర్తి అతడి రావుని చూపించి.

"కన్నెక్ మూర్తి" ఆ తర్వాత మూర్తిని పరిచయం చేసింది రావుకి.

మూర్తి, రావూ చేతులు కలిపి మామూలు మాటలేవో చెప్పుకున్నారు.

టీ స్టాల్ కొంచెం గ్రాండ్ గా రెయిలింగ్ కానుకొని నిలబడ్డారు ముగ్గురూ. సాయంకాలం అరుగంటల వేళ - రోడ్డు. ఫుట్ పాత్ రకరకాల రంగుల్తో కళకళలాడుతున్నాయి.

"చాలారోజు లయింది చూసి!" - మూర్తి.

"చాలా పట్లనండి!" — ఉష.

"59 లో అనుకుంటాను! యింతకీ నాకు తెలియకుండానే కుదుర్చుకు

న్నాను బాసని! ఎన్నాళ్లయింది? ఏమన్నా ప్రోగ్రెసా?"

"మీరెక్కడా పత్తా తెలియకుండా మాయమైపోతే ఎక్కడికని రాయమంటారు? అన్నయ్య పాపం చాలా ట్రై చేశాడు మీ అడ్రస్ కోసం - ఏ డాది దాటిందేమో!"

"ప్రోగ్రెస్ కూడా అడిగాన్నేను!"

"పాయింటు మూడు." ఉష సిగ్గు పడి తల దించింది.

"కంగ్రాట్స్. రండి, యీ శుభ సమయంలో టీ పార్టీ చేసుకుందాం."

మూర్తి, ఉషా ముందు నడుస్తుంటే వెనకాల రావు కూడా అడుగులు వేశాడు.

"ఇవాళ ప్రొద్దున్నించీ నాకు ఏమిటో చెప్పలేనంత ఉత్సాహంగా ఉంది. అనుకోకుండా మీరు కనబడ్డానికి నాంది అన్నమాట."

"నాకూ చాలా ఆనందంగా ఉంది. యిన్నేళ్లకి మనం కలుసుకోడం, అందులో యిలా అనుకోకుండా! మీతో ఎన్నో మాట్లాడాలని ఉంది! ఎక్కడ మొదలెట్టాలో తెలియడం లేదు!"

"యిందాకట్నించీ చూస్తున్నా! ఏమిటా మన్నించడం?"

"సారీ. అయిదేళ్లతర్వాత యింకా పాత ధోరణిలో మాట్లాడ్డం...."

"అయిదేళ్లు కాదు, యాభై ఏళ్ల యినా మన స్నేహం చెక్కుచెదరదని మీ రారోజు పాంబీచ్‌లో కెరటాలు దిగజారిన చోట అద్దం లాంటి ఇసక జాలుమీద నిలబడి చెప్పారు. గుర్తుందా!"

"నువ్వేం మారలేదు, ఉష్!"

"ఎన్నేళ్లయిందో ఆ పిలుపు విని!"

"రవి ఏమయ్యాడు?"

"అన్నయ్య హెచ్ ఎలక్ట్రికల్స్ ట్రైనింగ్‌కి జెకోస్లవేకియా వెళ్లాడు."

"ఏమిటో, యిందులో చేరాక 'నా'అన్నవాళ్లు దూర మయ్యారు!"

"కోరి వెళ్లిందే గా! యింక యిప్పుడు అనుకోడం దేనికి!"

"వెళ్లిందానికి బాధ పడ్తున్నా ననుకుంటున్నావా? నెవర్."

"మీరు లోప లేమనుకున్నా, నా యెదట తేలనియ్యరని నాకు తెలుసు!"

"నన్ను చూస్తే ఎలా కనబడుతున్నాను! బాధ పడుతున్నవాడిలా ఉన్నానా?"

"ఏమో, నాకళ్లకి అలాగే ఉంది!"

"అది నీ అభిమానం, అంతే."

"పోనీలెండి, యింక యిప్పుడా పాత వాద నెందుకు. అయిం దెలాగూ అయింది!"

"యింతకీ యిన్నాళ్లక్కనబడ్డానా; మరి నీ పెళ్లి డిన్నరు ఎప్పుడు తినిపిస్తావు?"

"ఏమిటో మతిలేదు; ఏం మాట్లాడుతున్నానో నాకే తెలియడం లేదు!

రండి, యింటికి వెళ్దాం. అక్కడ తీరిగ్గా మాట్లాడుకోవచ్చు."

"పోనీలే, జ్ఞాపకం చేశాకయినా పిల్చావు!"

"క్షమించండి, ఏదో మాట్లాడుతూ మర్చిపోయాను. అయినా ఆ మాత్రం నన్నర్థం చేసుకోగలరని నాకు తెలుసు."

"అసలు నువ్వు పిలవాలా ఉషా! నువ్వ ఊర్లో ఉన్నావని తెలిస్తే వెతుక్కుంటూ వచ్చి నువ్వు వెళ్లమన్నదాకా ఉండిపోయేవాణ్ణి!"

"ఉత్తి కబుర్లు చెప్పడం మాత్రం మానలేదు మీరు. యిప్పుడు తప్పించుకోడానికి ప్లాను వేస్తున్నారు. నాకు తెలుసులెండి! ఆ ఆట లేం సాగవు! యివాళ మాయింటికి రావలిసిందే!"

"ఇవాళ ఒక్కరోజేనా? నేనింకా ఏ వారం పది రోజులో ఉందామనుకుంటున్నాను! నన్ను చాలా నిరాశ పర్చావు! చూడు, మీ ఆయన కూడా ఏం మాట్లాడ్డం లేదు!" మూర్తి నవ్వాడు.

"అదేమిటి! మీరు తప్పకుండా రావాలి. నే నేదో ఆలోచిస్తున్నాను!" రావు తడబడ్డాడు.

"వారం పదిరోజు లుండక్కర్లేమ లెండి! యివాళ్టికి రండి. ఆ మాత్రం దయ చాలు."

"నువ్వంటే నా కెంతఅభిమానమో నీ హృదయాన్నడుగు, చెపుతుంది!"

"అడగక్కర్లేదు, నాకు తెలుసు. అంత అభిమానం ఉండబట్టే గాబోలు, ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేకుండా పోయింది!"

"ఉషా, నే నున్న పరిస్థితు లెలాంటివో నీకు తెలియదూ!"

"ఆ పరిస్థితులకి కారణం మీరేగా!"

"యిక్కడే కొంచెం వేదాంతం అవసరం. పరిస్థితులు మనుష్యుల యిష్టాయిష్టాల్నధిగమించి వస్తూంటాయి!" నవ్వాడు మూర్తి.

"నాకు మీ వేదాంత మేం అక్కర్లేదు. యిప్పు డింటికి రండి."

"అయిదేళ్లు దాటినా నువ్వు నా వేదాంతాన్ని గౌరవించడం నేర్చుకోలేదు!"

"మహాప్రభో! మీరు స్వామి వివేకానంద తర్వాత అంతటివారు. సరేనా? యింక నా మాటకి సమాధానం చెప్పండి,"

"నాకూ ఓ చెల్లెలున్నా, నీ అంత అభిమానం చూపించేదిగాదేమో!"

"అయితే రారన్నమాట!"

"సారీ, యివాళగాదు. మరోసారి."

.....

"కోపమా?"

.....

"తల్లివి కాబోతున్నావు. నీ కింకా ముక్కుచిగుర్న కోపం పనికిరాదు ఉషా!"

"ఎలాగైనా మీ రివాళ మా యింటికి రావాలి!" రావు బలవంతం చేసే ధోరణిలో అన్నాడు.

"ఆయన పెద్ద ఆర్మీ ఆఫీసరు; ఎనిమిదివందలు జీతం; మనలాంటి సామాన్యుల యిళ్ళ కెలా వస్తారెండి! అడగడం మనదే తప్పు!" ఉష గొంతులో బాధ ధ్వనించింది.

"మనిద్దరిమధ్య యిలాంటి మాటల కవసరం కలుగుతుం దని ఎప్పుడూ అనుకోలేదు నేను!"

"అవసరం కలిగించింది మీరే!"

"ఉషా!" గట్టిగా నవ్వాడు మూర్తి. "యీ వీకెండ్ పూర్తిగా మీ యింట్లోనే; శనివారం సాయం కాలం అయిదింటికి మీ యింటో హాజరవుతాను. ఆదివారం సాయం త్రం అయిదింటికి నన్ను వదలాలి. యీలోగా డిన్నర్, సినిమా, పిక్నిక్ - ఏం అరేంజ్ చేస్తావో చూస్తాను!"

"వస్తా రని గారంటీ ఏమిటి?"

"నా మాటకి అంత విలువ ఉందన్న మాట నీ దృష్టిలో!"

"అబ్బే, అదేం కాదు, ఊరికే అన్నాను. ఐరన్ విల్ ఎలాంటిదో నాకు తెలియదూ!" ఉష నిండుగా నవ్వింది.

"ఆకాశంలో చందమామ లేకుం డానే మల్లెపూల్లా వెన్నెల విరుస్తోం దేమిటో చిత్రం!"

"ఉహూ!" ఉష కోపంగా చూసి మూతి ముడిచింది.

"లోకాన్ని చీకటిచెసేయకుమరి!"

"పాతవిట్లు వల్లించేబదులు క్రొత్త కబుర్లు ఏవన్నా చెప్పకూడదూ! ఏయేచోట్లు తిరిగారు? యిన్నేళ్ళు యెక్కడున్నారు? యెలా గడిచాయి రోజులు? లడఖ్ ఆపరేషన్లో మీ రక్కడ ఉన్నారా?"

"యుద్ధ విశేషాలు అడవాళ్ళకి చెప్పవద్దని ఇతిహాసం, శాస్త్రం రెండూ చెప్తున్నాయి!"

"నే నేం యుద్ధం గురించి చెప్ప మనడం లేదు!"

"అయినా నీ దగ్గిర నాకు దాపరిక మేమిటి ఉషా!"

"అన్నీ మీరే అంటారు! ఎన్నేళ్ళు ఐతే నేం, ఆ మాటల గారడీ యెక్క డికి పోతుంది?"

"అన్నట్టు యిప్పు డా ఓల్డ్ హేగ్ ఎక్కడుంది?"

ఉష విరగబడి నవ్వింది ఆ మాటకి.

"మీ రింకా ఆవిడని క్షమించ లేదన్నమాట! అంత పగ ఏమిటి బాబు!"

"యీ జన్మలో మర్చిపోలేని మహా వ్యక్తుల్లో ఆమె ఒకతే!"

"ఏమోయ్ నీ ఫ్యాక్టరీ కాలిపోయిందటగా! ఆ మంట లెవ్వరూ ఆర్పలేకపోయా రటగా! ఇంతకూ ఆ ఫ్యాక్టరీలో ఏం తయారు జేస్తారోయ్?"

"హుం, నిప్పు నార్పు యంత్రాలు."

"కాకినాడలో లెక్చరర్ అనుకుంటాను!"

"నీ కెప్పుడన్నా ఉత్తరాలు రాస్తూందా?"

"నా కామెతో పరిచయం తప్పించి స్నేహ మసలులేదు ఏదో ఒకచోట ఉండే వాళ్ళం గాబట్టి మాట్లాడే దాన్ని ఐనా మీ రంత మరీ సెన్సిటివ్ అయితే ఎలా చెప్పండి!"

"వాళ్లేర్లో జరిగిన ప్రతి సంఘటనా, నాలో చెక్కు చెదరకుండా ఎప్పటికీ నిల్చిపోతుంది!"

"ఆ రోజుల ప్రభావం అలాంటిది!"

"నే నొక మనిషిగా తయారయింది యూనివర్సిటీలోనే! అందుకే ఆ రోజుల కంత విలువ!"

"మీ రొక్కరేగాదు అందరూ అంతే"

"అందరి విషయమూ మాట్లాడకు, యిప్పుడు నీ సంగతి, నా సంగతే మాట్లాడుకుందాం"

యిద్దరూ మెల్లిగా రెయిలింగ్ వైపు చేరారు హుసేన్ సాగర్ నీళ్ళలో చీకటి తెరలు దిగుతున్నాయి రాత్రి దీపాలకాంతుల్లో అమ్మాయిలు అబ్బాయిలు క్రొత్త అందాలు అరువు తెచ్చుకుంటున్నారు.

"వెన్నెల రాత్రులు, బీచిలో రెండింటిదాకా నిద్రా, తిండీ మర్చి పోయి ఏమేమిటో పిచ్చిగా మాట్లాడు కున్న ఆరోజులు లాంటివి మళ్ళీ ఎప్పుడన్నా చూస్తామా అనిపిస్తుంది!"

"ఒకవేళ అలాంటి రాత్రులు వచ్చినా, అలా అనుభవించగల హృదయాలు మన కుండవు. ఆ వయస్సు అలాంటిది!"

"అన్నట్టు మీ ఆర్టిస్టుఫ్రెండ్ ఎక్కడ యిప్పుడు?"

"పాపం, యిబ్బందుల్లో ఉన్నాడు, కృష్ణమోహన్. నా కెంతో సహాయం చేసి ఆదుకున్నాడు. నాకవసరం వచ్చి నప్పుడు. అలాంటిది అత నడిగినప్పుడు సేమ చేయ్యలేకపోయాను! ఆ జ్ఞాప కమే న న్నెప్పటికీ చిత్రవధ చేస్తూం టుంది!"

"ఏం చేస్తాంలెండి! ఒక్కోసారి అవ కాశం ఉండకపోతుంది!"

"పాపం, ప్రతీ ఉగాదికీ, దీపావళికీ కొత్త పెయింటింగ్ ఒకటి వారాలకి వారాలు కష్టపడి గీసి, అందమైన గ్రీటింగుతో పంపేవాడు. ఒకసారేం రాశాడో తెలుసా? తనూ, తనలాంటి వాళ్ళంతోమంది 'ఎంతవాడయ్యాడు మూర్తి' అని అసూయతో కుళ్ళేటంత పెద్దవాడ్నయిపోవాలిట! అంతటి అభిమానానికి నేను చేసిన ప్రతికృతి, అడక్క అడక్క అతను వంద రూపా యలు అడిగితే వీల్లేదని జవాబివ్వడం ఒకోసారి నా అసమర్థతకి నాకు అవ మానంగా ఉంటుంది!"

"మీరు గాబట్టి అంతగా ఫీలవు తున్నారు. ప్రతి మనిషి జీవితంలోను యిలాంటి సంఘటన లెన్నో జరుగు తూనే ఉంటాయి. వాటిని మర్చి పోవాలంతే!"

"ప్రతీ మనిషిసంగతి అలా ఉంచు. అందర్లాగానే మనమూ ఉండాలా?"

"ఇంతకీ యిన్నేళ్ళ మనస్నేహం యిలా మూలపడినందుకు ఏం విచారం లేదన్నమాట!"

మూర్తి మాట్లాడలేదు.

"మాట్లాడరేం?"

"ఏవో పరిస్థితుల్లో అప్పు డంతా అలా జరిగిపోయింది. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా వీలుకాలేదు. ఒక విధంగా చూస్తే తప్పంతా నాదే. కాని....జరిగిపోయిందానికి విచారించి లాభ ముండదని తృప్తిపడాలి మనం."

"మన విషయందగ్గిరకి వచ్చేసరికి వేదాంతం వస్తుంది!"

"నీ మనసులో బాధ అణుచుకోలేక నువ్వు బయట పెట్టున్నావు! నేను అది లోపల కాలుస్తున్నా దాచుకోవా లని చూస్తూన్నాను!" అంతే తేడా!"

మూర్తి, ఉషా దగ్గిరగా నడుస్తూ ర హస్యాలు చెప్పుకుంటున్నంత మెల్లిగా మాట్లాడ్తూంటే, అడ్డు తగు

ల్తున్న మనుష్యుల్ని తప్పించుకుంటూ అడుగులు వేస్తున్న రావుకి వాళ్ళ మాటలు పూర్తిగా వినబడ్డంలేదు.

జస్ట్ స్టాండ్ దగ్గిర ఆగారు ముగ్గురూ. ఉప కళ్ళలో నీటిపొరలు మెరవడం చూశాడు రావు. మూర్తి మొగంలో ఆనందమో, విచారమో తెలియని చిరున వ్వుంది.

"వెళ్ళాండి. మళ్ళీ కలుసుకుందాం." రావుతో చెప్పాడు మూర్తి.

"శనివారం తప్పకుండా రావాలి." రావు చేతులు కలిపాడు.

"ఉమ్!"

"ఊఁ!"

"వెళ్తున్నా! ఒక్కసారి నవ్వు తావా?"

ఉష పెదాలమీద పేలవంగా కదిలిన నవ్వు పూర్తిగా చూడకుండానే వెళ్లిపోయాడు మూర్తి.

బస్ వచ్చేవరకు అతని వంకే చూశారు యిద్దరూ. బస్‌లో కూర్చొన్నంతసేపు బయటికి, రోడ్డుమీదికి చూస్తూ ఉండిపోయింది ఉష.

"నీకు అంత బాగా తెలుసా ఆయన?" రావు అడిగాడు బస్ దిగి యింటికి నడిచే దారిలో.

"అన్నయ్య కాయన అంటే పంచప్రాణాలు. 'ఆడపిల్ల వయితే అతని కిచ్చి పెళ్లి చేసేవాళ్లం! మగాడివై పోయావు!' అనేది అమ్మ. అన్నయ్యా, ఆయనా హైస్కూలు నుంచి కాలేజీ దాకా కలిసి చదివారు. ఆ తర్వాత ఆయన వాల్తేర్లో చేరారు. అన్నయ్య కాకినాడలో. ఆయన వెళ్లిన తర్వాత మరో ఏడాదికి నేను వెళ్లాను. అక్కడే పరిచయం."

మూర్తి పొడుగు కాదు: ధృఢమైన శరీరం. యీ లోకంలో ఎవర్నీ తెక్క చెయ్యనట్టు నిర్లక్ష్యం నిండిన చూపులు. సన్నగా నాజూగ్గా ఉన్నాడు—ఆలివ్ గ్రీన్ యూనిఫారం. పీకాక్ క్రాస్‌బెల్ట్, బుజాల మీద మూడు నక్షత్రాలు, ప్రక్కల్న "జాట్"అని ఇంగ్లీషులో మూడు అక్షరాలు—ఇన్‌ఫెంట్రీ యూనిఫాంలో మూర్తి. హుందాకి, రివికి నమూనాఅన్నట్టున్నాడు ప్రాణాలకి లెక్కచెయ్యని సాహసానికి, శౌర్యానికి ప్రసిద్ధి చెందిన జాట్ రెజిమెంటులో ఆఫీసరుకి కావాలిసిన తెగింపు, పట్టుదల, ఆత్మవిశ్వాసం మూర్తిలో ఉట్టిపడ్తున్నాయి. రావుకి మూర్తి విగ్రహం కళ్లెదుట నిల్చింది.

"ఆయన కున్న తెలివి తేటలకి, బయటెక్కడున్నా ఆమాత్రం సులభంగా సంపాదించగలరు! కాని ఏమిటో, మనిషి మొదట్నుంచీ అదో మోస్తరు. తన కెంత తోస్తే అంతే. యింక దేవుడు దిగొచ్చినా అనుకున్నది మానడం లేదు. అందులోనూ ఎవరన్నా అది చెయ్యడం కష్టం. అది చెయ్యవద్దంటే, ముమ్మాటికీ చేసితీరే రకం!"

"దేశ రక్షణకి అలాంటి వాళ్లే కావాలి!"

"దేశాన్ని రక్షించడానికి ఈయనే వెళ్ళా లేమిటి?"

"ఎవరిమటుకు వాళ్ళు అలానే అనుకుంటే యింకెలాగ?"

"రేపు యీయన కేమన్నా అయితే ఆ బాధ ఎవరికి?"

రావు మాట్లాడలేదు.

ఆ తర్వాత ఒకటి రెండు రోజులు రావుకి ఉషకి మధ్య సంభాషణలు

"రేయ్ చెల్లాయి చెవి ఎందుకు కొరికావురా ?"
"నే కొరకలేదు నాన్నా. అదే కొరుక్కువి ఏడుస్తోంది."

మూర్తి చూట్టూనే తిరిగాయి రావు మాట్లాడిం దేంలేదు ఉషలో మూర్తి ఎంతలోతుగా నాటుకున్నాడో తెలుసుకోడానికి అతను చేసిన ప్రయత్నాలు అవన్నీ

మూర్తి ప్రవర్తన ఎన్నడూ ఎవరూ వంక పెట్టలేనట్టిది. కపటం, కల్మషంలాంటివి అతనికి తెలియవు నిజమనుకున్నది తెగేసి చెప్పడం, నిజం కానిది ఎవరు చెప్పినా అప్పటి కప్పుడే ఖండించడం అతని నైజం అతని లోనూ కొన్ని బలహీనత లున్నాయి. మొండితనం, మితిమీరిన ఆత్మవిశ్వాసం ఎదటివాళ్ళని నిర్లక్ష్యం చేసేంత వరకు, తీసుకుపోతాయి ఒకోసారి పట్టుదల పరిస్థితుల కెదురీదమంటుంది. అందువల్ల భంగపడ్డం మిగుల్తుంది చివరికి కాని యివన్నీ లోపాల్లా కనిపించినా, నిజానికి అతని ధైర్య సాహసాలకి నిదర్శనాలు ఆ పట్టుదలతోనే అత నెన్నిట్లోనో పేరు తెచ్చుకున్నాడు కథలురాశాడు, ఉపన్యాసాలిచ్చాడు నాటకాల్లో వేషాలు వేశాడు నిజానికి వీటిలో ఎందులోనూ అతనికి జన్మతః వచ్చిన కౌశలం అంటూ ఏంలేదు. కేవలం పట్టుదలతో, కుతూహలంతో అన్నిట్లోనూ ఔనని పించుకునేవాడు మూర్తి. చివరి కా పట్టుదలే ఆర్మీలో జేర్చింది. యింటి దగ్గిర ఏది ఏమిటో తెలియని ముసలి వాళ్లని మాయజేసి స్నేహితు లెవరేం చెప్పినా వినకుండా యింత చదువూ

చదివి . ఇన్ ఫెంట్రీలో జేరాడు! మూర్తిలో అన్నిటికన్నా చెప్పుకో దగింది — స్నేహితులకి స్నేహాలకి అత నిచ్చే విలువ. అతను మనసార నమ్మిన స్నేహితులు కొద్దిమందే అయినా, వాళ్ళకోసం అతను ప్రాణ మిస్తాడు. అంతకన్నా అత నంటే ఎక్కువ అభిమానం అతని స్నేహితులకి. అతనిలో గుణాలకన్నా లోపాలు మరింత ఆకర్షనీయంగా ఉంటాయి. అత న్నెరిగున్నవాళ్ళందరికీ అత నొక ఆదర్శమూర్తి.

ఉష రకరకాల సన్నివేశాల్లో మూర్తి గురించి వ్యక్తపర్చిన అభి ప్రాయాల సారాంశం అది. అస లంతగా మాట్లాడే రకంకాదు ఉష. రావు ఆమె నెరిగిఉన్న ఏడాదిలో ఆ రోజు చూసినంత ఉత్సాహంగా ఉల్లా సంగా ఎన్నడూ చూడలేదు. ఆ రోజు ఆమె మొగంలో, అతనితో మాట్లాడు న్నంతసేపూ కోటిదీపాల కాంతి కళక ళ్ళాడింది.

ఏమిటి సంబంధం? వాళ్ళిద్దరూ వాల్తేర్లో గడిపిన రెండేళ్ళూ రావు ఊహాలోకంలో రకరకాల బొమ్మల్ని చూపెడ్తున్నాయి. రావు వాల్తేర్ చూడలేదు.

అర్ధరాత్రి పన్నెండు గంటలు. వెన్నెల. బీచ్. మూర్తీ, ఉషా యిద్దరూ మరేవ్వరూ లేని ఒంటరి తనంలో సముద్రం అలలు చేసే హోరు మధ్య ఏవో 'స్వీట్ నథింగ్సు' మర్మరిస్తూం టారు. మూర్తి నోటంట వచ్చే ప్రతీ మాటా వేద మన్నట్టు ఆరాధనలో తన్మయురాలై ఉంటుంది ఉష. ఆ సంబంధం ఎలాంటిది?

"వెన్నెల రాత్రులు బీచిలో రెం డింటి దాకా నిద్రా, తిండీ మర్చిపోయి ఏమిటేమిటో పిచ్చిగా మాట్లాడుకున్న ఆ రోజుల్లాంటివి మళ్లా ఎప్పుడన్నా చూస్తామా అనిపిస్తుంది!" మూర్తితో ఉష అన్నమాట లవి!

ఆ పిచ్చిమాట లెలా ఉంటాయి? రావు ఆలోచించాడు. ఆలోచించిన కొద్దీ మరీలోతుగా దిగిపోతున్నట్టుంది.

"యింతకీ యిన్నేళ్ల మన స్నేహం యిలా మూలపడినందుకు ఏం విచారం లేదన్నమాట?" మరో సందర్భంలో ఉష అడిగింది.

ఉష కిప్పు డున్న పరిస్థితి బాధా కరంగా ఉందా? మూర్తిని చూడగానే ఆమెలో వెలిగిన కాంతి కేమి టర్థం? ఏ మనుకోవాలి తను?

అసలు.....

మొదట్లో పరిచయం చేసేప్పుడు "మీట్ మై బాస్" అంది ఉష. ఆధు నికంగా కనబడింది, గాని—తను యజ మాని! అతను స్నేహితుడు! ఆమె దృష్టిలో తమ యిద్దరి స్థితులూ అవేనా? రెంటికీ యెంత తేడా?

. చిన్నవిగా ముదలైన ఆలోచనలు క్షణ క్షణానికి పెద్దవై పోతున్నాయి సాయంకాలం నీడల్లా పెరిగే వాటిని చూస్తే చెప్పలేని భయం, బాధ!

ఉష అందర్లాంటిదీ కాదనుకునే వాడు తను, ఆమె నిబ్బరం, ప్రశాంతత చూసి ఎన్నడూ కఠినంగా మాట్లాడదు, అసలా చూపుల్లోనే ఎదటివాళ్ల కాఠిన్యాన్ని కడిగేసే నిర్మలత నిశ్చలత్వం ఉన్నాయి ఆ సిరాడంబరతని చూసి తను చాలా అదృష్టవంతు డనుకునేవాడు కాని లోతు నీరు గంభీరంగా ఉంటుం దంటారు. ఉష ఆమాట ఋజువు చేసింది ఆమె హృదయపు లోతు తనెంత తరిచినా అంతు చిక్కడంలేదు ఆమె కేవలం అతని అభిమాని మాత్రమేనా? లేక—

"నాకూ ఓ చెల్లెలున్నా. నీ అంత అభిమానం చూపించేది గాదేమో!" మూర్తి అన్నాడు ఒక చోట.

రావు ఒక నిర్ణయాని కొచ్చాడు. యింక ఆలోచనలకి పెద్ద బ్రేకు వేసి మూర్తికి చెల్లెలు లాంటిది ఉష అన్నా చెల్లెల్లిద్దరికీ మూర్తి ఓ మహామేరు వంతటి మనిషి అతని ఆరాధనలో వాళ్లిద్దరూ లోకాన్నే మర్చిపోతారు లేకపోతే తన ఉనికే గమనించకుండా అతనితో అలా మాట్లాడేదా? తనతో కూడ ఎన్నడూ అంతగా మాట్లాడి ఎరగని ఉష!

అలా అనుకుంటే రావుకి శాంతిగా ఉంది! ఉష మాటలు వేటికీ యిప్పుడు విపరీతార్థాలు రావు. మరోలా అనుకుంటే ఆ జీవితాంతం తనని విడవకుండా వెంటాడే నీడ, తనకీ తన కుటుంబానికీ శాంతీ, సుఖం కరువు చేస్తుం దని రావుకి తెలుసు.